క్లుప్తంగా

శాకంబరి అవతారంలో మోదమ్మ



మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో మోదకొండమ్మ అమ్మవారు శాకంబరి అవతారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు డి. భవానీశర్మ సారథ్యంలో అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

అధిక జనాభాతో నష్టం



మాకవరపాలెంలో వైద్య సిబ్బంది ర్యాలీ

మాకవరపాలెం: చిన్న కుటుంబం చింత లేని కుటుంబమని వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి మాకవరపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక జనాభా వల్ల నష్టం, జనాభా నియంత్రణతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదల అనర్థదాయకం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: జనాభా పెరుగుదల పలు అనర్థాలకు హేతువని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ ఉపన్యాసకుడు ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, అధ్యాపకులు టి.రాధాకృష్ణ, వి.అప్పలనాయుడు, ఎస్.మల్లిబాబు జనాభా పెరుగుదల వల్ల కలిగే దుష్పరిణామాలను సోదాహరణంగా వివరించారు. ముందుగా జనాభా పెరుగుదలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థుల ఆందోళన

చోడవరం రూరల్: స్థానిక కాలేజీలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు నిరసన ప్రదర్శన, ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా నాయకుడు సియ్యాద్రి రుద్రి మాట్లాడుతూ చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లను నియమించాలని, విద్యార్థినులకు టాయిలెట్లు, మంచినీరు, తగినన్ని బెంచీలను సమకూర్చాలని, తదితర డిమాండ్లను ప్రస్తావించారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు ఎ.మౌనిక, ఎం.సన్యాసయ్య, శ్రీహరి, రాజేష్, ప్రశాంత్, హేమ పాల్గొన్నారు.

కె.జె.పురంలో పారిశుధ్య నిర్వహణ



కె.జె.పురం జంక్షన్ నుంచి జంగిల్ తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబ పండగ సందర్భంగా ఇక్కడ జంక్షన్ నుంచి చెరకు కాటా వరకు పేరుకు పోయిన చెత్తాచెదారాలను తొలగించారు. మంగళవారం మోదమాంబ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ జామి రమణబాబు సారథ్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా భారీగా పేరుకుపోయిన తుప్పలు, డొంకలను తొలగించారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఆగ్రహం



రావికమతం: కొత్తకోటలో మానవహారంగా ఏర్పడ్డ వలంటీర్లు



మాడుగులలో వలంటీర్ల నిరసన

- వెంటనే క్షమాపణ చెప్పాలని వలంటీర్ల డిమాండ్
- చోడవరం, రావికమతం, మాడుగులలో ఆందోళనలు, మానవహారం

ప్రజా సేవే పరమావధిగా అంకితభావంతో పనిచేస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులతో పోలుస్తూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం పెల్లుబికింది. మంగళవారం చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో గ్రామ వలంటీర్లు ఆందోళనలకు దిగారు. మానవహారాలు చేపట్టి నినాదాలు చేశారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మలు దహనం చేశారు.

చోడవరం: చోడవరం పట్టణంలో గ్రామ వలంటీర్లు ఆందోళనకు దిగారు. చోడవరం సచివాలయం నుంచి కొత్తూరు జంక్షన్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేశారు. కొత్తూరు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. వీరి ఆందోళనకు ప్రజలు సైతం మద్దతు పలికారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో ప్రజలకు చేరవేయడంతోపాటు వారి సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న తమపై పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేయడం సరికాదని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా వంటి భయానక సమయంలో రోడ్లపైకి వచ్చి పవన్ కల్యాణ్ ఏ ఒక్కరినైనా పరామర్శించి, వారికి అండగా నిలిచారా అంటూ ప్రశ్నించారు. అలాంటి సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి కరోనా రోగులను సైతం పలకరించి, వారికి



చోడవరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వలంటీర్లు

అవసరమైన వైద్యం సాయం అందించడానికి ఆస్పత్రికి తరలించామన్నారు. తాము చేస్తున్న సేవలు ప్రజలకు తెలుసునని, వాటిని గుర్తించక పోగా తమపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ప్రజల డేటా బయటకు పోతుందనడంలో వాస్తవం లేదని, పథకాల మంజూరుకు ఏ మేరకు వివరాలు అవసరమో అవి మాత్రమే సేకరిస్తున్నామన్నారు. వలంటీర్ల సంఘం ప్రతినిధులు పాతపల్లి రేవతి, రాయిశెట్టి రమణ, బొగ్గు శాంతి, ఓరుగంటి రామకృష్ణ, ఐతా భారతి, చల్లా రేఖాదేవి, కుమారి, పాతపల్లి దేవి, కనిగిరి హేమామనీషా, ప్రసన్న, అడిగర్ల మణికంఠవాసు, బత్తిన శివరామ్‌గణేష్ పాల్గొన్నారు.

కొత్తకోటలో వలంటీర్ల మానవహారం

రావికమతం: మానవత్వంతో మెలగుతూ సేవా భావంతో పనిచేస్తూ ప్రజాదరణ పొందిన తమను అవమానించిన పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కొత్తకోట మెయిన్‌రోడ్డులో గ్రామ వలంటీర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. నిరాధార ఆరోపణలు చేసిన పవన్‌కల్యాణ్ తక్షణమే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భయంకరమైన కరోనా సమయంలో తను ఇంట్లో దాక్కున్నారని, తామంతా ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి ఎన్నో సేవలందించామన్నారు. ఇప్పుడు తమ మనోభావాలు దెబ్బతినేలా నీచంగా మాట్లాడటం తగదన్నారు. తప్పు తెలుసుకుని బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

పవన్ దిష్టిబొమ్మ దహనం

మాడుగుల: సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి ముంగిటకు అందిస్తున్న తమపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాడుగుల పట్టణంలో పవన్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై నిందలు మానుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

టీడీపీ కాంట్రాక్టర్ తీరుపై సీఎం దృష్టికి తీసుకెళ్తా

- కావాలనే బీఎన్ రోడ్డు పనులు ఆలస్యం
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: ఎంతో ప్రాముఖ్యత కలిగిన భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్‌రోడ్డు) రోడ్డు పనులు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేనని, టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతోనే పనులు ఆలస్యం చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ధ్వజమెత్తారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ధర్మశ్రీ దృష్టికి బీఎన్ రోడ్డు కష్టాలను పలువురు సభ్యులు తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందించి చేసిన పనులకు పెండింగ్ బిల్లులు లేకపోయినా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా రావికమతం, వడ్డాది, కొత్తకోట, రోలుగుంట గ్రామాల్లో సీసీరోడ్డు వేసేందుకుగాను అదనంగా రూ.8.60 కోట్లు మంజూరు చేయించానన్నారు. అయినప్పటికీ రెండు రోజులు పనులు చేయడం 15 రోజులు ఆపేయడం చేస్తున్నాడని మండిపడ్డారు. ఆ పనులు కూడా పెద్ద పెద్ద గోతులున్న చోట ముందుగా చేయాలని చెప్పినా, పెడచెవిన పెట్టాడన్నారు. ఈ విషయమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, ప్రతి పంచాయతీలోనూ పాలకవర్గం తీర్మానాలు చేసి తనకివ్వాలని సర్పంచ్, ఎంపీటీసీలకు సూచించారు. తట్టబందలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని మార్చాలని కోరుతున్నా ట్రాన్స్‌కో ఏఈ పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ రమణ సభ దృష్టికి తెచ్చారు. కొత్తకోటలో ఇంటింటి కుళాయి పనులు ఆగిపోయాయని, తాగునీటి ఇక్కట్లు నెలకొంటున్నా ఎవ్వరూ పట్టించుకోలేదని ఎంపీటీసీ పూడిదేవా సభ దృష్టికి తెచ్చాడు. గ్రామానికి చెందిన ఎత్తుల లక్ష్మి వీవోగానూ, ఆశ కార్యకర్తగానూ విధులు నిర్వర్తిస్తోందని గతంలోనే ఫిర్యాదు చేసినా ఇప్పటికీ అధికారులు స్పందించ లేదన్నాడు. వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, అధికారులు పాల్గొన్నారు.

రూ. 4.8 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు



ముత్యాలమ్మపాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ భాస్కరరావు

దేవరాపల్లి: స్థానిక పంచాయతీలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు డిప్యూటీ బూడి ముత్యాలనాయుడు చొరవతో రూ. 4.8 కోట్ల జలజీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. దేవరాపల్లి శివారు ముత్యాలమ్మపాలెంలో రూ.30 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం ఆయన స్థల పరిశీలన చేశారు. పంచాయతీ పరిధిలో ఇప్పటికే మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గండిపడాల అప్పలరాజు, వార్డు మెంబర్ కొల్లి ఈశ్వరరావు, పరవాడ రవి పాల్గొన్నారు.

త్వరితగతిన రెండో విడత రీ సర్వే పూర్తి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీవో

మాకవరపాలెం: రెండో విడత భూముల రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జి.గంగవరం, శెట్టిపాలెం, తదితర గ్రామాల్లో చేపట్టిన రెండో విడత రీసర్వే సమీక్షించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండో విడత పూర్తి కాగానే మూడో విడత ప్రారంభించేందుకు సిద్ధం కావాలని సూచించారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ శంకర్రావు పాల్గొన్నారు.

జగనన్న సీఎం అయ్యాకే సంక్షేమ పాలన

'గడపగడపకు మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సమస్యలేమైనా ఉన్నాయా అని మహిళను అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

రావికమతం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే పేదలందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని, మళ్లీ ఆయన్నే గెలిపించుకుని మరిన్ని పొందుదామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గొంపలో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగారు సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను విన్నవించారు. గ్రామంలో పైడితల్లమ్మ గుడి వద్ద కల్వర్టు నిర్మించాలని, వర్షం పడితే రోడ్డుపై నీరు నిలిచిపోతున్న దృష్ట్యా సీసీడ్రైనేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కంట్రెడ్డి సూరిబాబు, సతీష్ ధర్మశ్రీని కోరారు. వీటి నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం..

గ్రామంలో రూ.45 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును విప్ ధర్మశ్రీ ప్రారంభించారు. ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, గ్రామ సర్పంచ్ కంట్రెడ్డి గోవింద, మాజీ సర్పంచ్ అధికారి రాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పారదర్శకతకు ఇంటింటా సర్వే



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

కె.కోటపాడు: ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా ఉండేందుకు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత తెలిపారు. మండలంలోని బీఎల్వోలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సర్వేలో ఇంకా ఓటర్లుగా నమోదు కావాల్సిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. వలసలు, మరణించిన, వివాహమై ఇతర గ్రామాలకు వెళ్లిన ఓటర్ల వివరాలను గుర్తించాలన్నారు. తద్వారా తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలన్నారు. తహసీల్దార్ జె.రమేష్‌బాబు, డీటీ రమేష్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే ఖబడ్దార్

- దిబ్బ చెరువు ఆక్రమణదారులకు గడువు
- నాతవరం తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు



చెరువులో సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తున్న సర్వేయరు, రెవెన్యూ అధికారులు

నాతవరం: రైతుల సాగునీటికి ఆధారమైన చెరువులను ఆక్రమిస్తే ఖబడ్దార్ అంటూ ఆక్రమణదారులను తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాసనాయుడు హెచ్చరించారు. మన్యపురట్ల గ్రామానికి చెందిన కొంతమంది ఎ.పి.పురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 38/2లో నాలుగెకరాల విస్తీర్ణం దిబ్బ చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నారు. దీనిపై ఆయకట్టుదారులు ఫిర్యాదు మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి చెరువును సర్వే చేశారు. సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న ఆక్రమణదారులు తాము చాలా కాలంగా సాగు చేసుకుంటున్నామని, తామిప్పుడు ఎక్కడికి పోవాలంటూ వాదించారు. సమస్య జఠిలం కాకుండా ఆక్రమణదారులకు రెండు రోజుల పాటు గడువు ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు రానంత వరకు తాము ఎవ్వరి జోలికి వెళ్లబోమన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కలెక్టరు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు సహకరించాలన్నారు. సర్వేయరు బాలరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఎంఈవోలు-1గా బాధ్యతల స్వీకరణ



ఎంఈవో-1 లక్ష్మి



ఎంఈవో-1 తలుపులు



ఇన్‌చార్జి ఎంఈవో పడాల్‌దాస్

మాకవరపాలెం: నూతన ఎంఈవోగా ఎం.లక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవో-1గా పనిచేసిన నరేష్ ఇటీవల నక్కపల్లి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోటవురట్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.లక్ష్మి ఉద్యోగోన్నతిపై మాకవరపాలెం వచ్చారు. ఆమెను కార్యాలయ సిబ్బంది తోపాటు ఉపాధ్యాయులంతా శుభాకాంక్షలు తెలిపారు.

రావికమతం: ఎంఈవో-1గా సిహెచ్ తలుపులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జయలక్ష్మి బదిలీ కావడంతో ఆమె స్థానంలో చేరారు. నర్సీపట్నం మెయిన్ స్కూల్లో హెచ్‌ఎంగా పనిచేసి ఇక్కడకు ఉద్యోగోన్నతిపై వచ్చారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, అప్పారావు, నాగేశ్వరరావు, రమణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరాపల్లి: ఇన్‌చార్జి ఎంఈవోగా బి. పడాల్‌దాస్ బాధ్యతలు స్వీకరించారు. ముంచంగిపుట్టులో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తూ దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన సిహెచ్. రవీంద్రబాబు చినగదిలి మండలానికి బదిలీ అయ్యారు.

ఇంటి వద్దే సేవలు ఏనాడైనా చూశామా?

జగనన్న సురక్ష కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ



ధ్రువపత్రాలు అందచేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రోలుగుంట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడం ఒక భాగం కాగా, జగనన్న సురక్ష పథకం ద్వారా అదనంగా మరో పదకొండు సేవల్ని అందించడం ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం రత్నంపేట, బుచ్చింపేట గ్రామాల్లో తహసీల్దార్ వరహాలు, ఎంపీడీవో ప్రభాకర్ రెండు బృందాలు జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించాయి. సాయంత్రం రెండు కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం, విద్యార్థులకు, ఇతర పథకాలకు అవసరమయ్యే ధ్రువపత్రాలను ఎటువంటి కనీస రుసుం లేకుండానే రోజుల వ్యవధిలో వారి ఇంటి వద్దకే అందచేయడం గతంలో ఎన్నడైనా చూశామా, కనీసం ఆశ పడ్డామా అంటూ తనదైన శైలిలో ఛలోక్తులు విసిరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడంతోపాటు, ప్రజలకు ఏది చేస్తే మేలు కలుగుతుందో దానిని ఆచరణలో చేసి చూపిన ముఖ్యమంత్రి మనకు దొరకడం మన అదృష్టమన్నారు. మన అవసరాలను ప్రభుత్వమే గుర్తించి వాటిని తీర్చడం అన్నది కలలో జరిగిన తీరుగా ఉందన్నారు. ప్రస్తుత సమయంలో విద్యార్థులకు ఎంతో అవసరమయ్యే వివిధ రకాల ధ్రువపత్రాలను మనకన్నా ముందే గుర్తించి ఉచితంగా అందచేస్తుండడం రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఉద్యమంగా సాగుతుందని కొనియాడారు. పలువురికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తమటపు సత్యంనాయుడు, ఉలబాల రాము, దాలబ్బాయి పాల్గొన్నారు.

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

- 'గడపగడపకు'లో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సంక్షేమ లబ్ధి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 2వ వార్డుల్లో మంగళవారం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఆయా కుటుంబాలకు లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష ద్వారా న్యాయం చేస్తామన్నారు. వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించామన్నారు. త్వరలోనే పనులు చేపడతారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో అందరి సహకారం అందించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు యాదగిరి శేషు, సిరసపల్లి వేణు, మున్సిపల్ కమిషనర్ కనకారావు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ



సింగన్నదొరపాలెంలో రైతులకు గడ్డి విత్తనాలను అందిస్తున్న ఏడీ బైరాగి



ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు

కె.కోటపాడు: పాడి రైతులు పశుపోషణలో జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి తెలిపారు. మంగళవారం సింగన్నదొరపాలెంలో పాడి రైతులకు రాయితీపై కాకిజొన్న, మొక్కజొన్న గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 శాతం రాయితీపై 5 కిలోల కాకిజొన్న రకం రూ.115కు, మొక్కజొన్న రకం రూ.85కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పశువులకు మేతగా మేలు రకం గడ్డి విత్తనాలను ఇవ్వడం వల్ల ఆరోగ్యంగాను, పాల దిగుబడి మెరుగ్గా ఉంటుందన్నారు. ఆర్బీకే పశువైద్య సహాయకుడు ఎం.బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ

చోడవరం రూరల్: ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో ఖరీఫ్ సేద్యానికి రైతన్నలు శ్రీకారం చుట్టారు. వరి నారుమడులను సిద్ధం చేసుకున్న వారికి ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న మేరకు రాయితీపై వరి విత్తనాలతోపాటు ఎరువులను మంగళవారం పంపిణీ చేశారు. అంకుపాలెం పంచాయతీలో పలువురు రైతులకు సర్పంచ్ నాగులాపల్లి (చందు) రాంబాబు, బెన్నవోలు సర్పంచ్ మూడెడ్ల శంకరరావు అందజేశారు.

ఎం. కోటపాడు రోడ్డులో కూరుకుపోయిన లారీ

ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడిన ప్రయాణికులు



ఎం. కోటపాడు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

మాడుగుల రూరల్: విశాఖ నుంచి పాడేరు వైపు వెళ్తున్న భారీ సిమెంటు లారీ ఎం. కోటపాడు రహదారిలో కూరుకుపోయింది. దీంతో ఇటు పాడేరు, అటు విశాఖ, చోడవరం వైపు వెళ్లే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడ రహదారి దెబ్బతినడంతోపాటు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో లారీ కూరుకుపోయి ట్రాఫిక్ స్తంభించింది. ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ రెండు జేసీబీలు, క్రేన్ సహకారంతో లారీని మంగళవారం ఉదయం పక్కకు తీయించారు. ఎస్ఐ దామోదరనాయుడు, తన సిబ్బందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మికి ఘన సత్కారం



చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్, సినీ నిర్మాత రామకృష్ణరాజు

నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బోడపాటి సుబ్బలక్ష్మికి సినీ నిర్మాత బెల్లంకొండ రామకృష్ణరాజు, శ్రీరామ్‌నగర్ వాసులు మంగళవారం 12వ వార్డులో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. చైర్‌పర్సన్‌తోపాటు, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తనకు పదవి వరించడానికి కారకులైన ఎమ్మెల్యే కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ సీనియర్ నాయకులు గుడివాడ లచ్చబాబు, వైద్యుడు కిల్లాడ సత్యనారాయణ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, పెట్ల ప్రసాద్ పాల్గొన్నారు.